క్లుప్తంగా

నేడు దొనకొండకు ఎమ్మెల్యే రాక

దొనకొండ: స్థానిక వైఎస్సార్ కాంతి పథం కార్యాలయంలో దొనకొండ, కురిచేడు మండలాలకు చెందిన డ్వాక్రా గూపులకు వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ బుధవారం విచ్చేయుచున్నట్లు ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు

పుల్లలచెరువు: పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరినట్లు ఎంఈవో శామ్యూల్‌జాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం రెండు సెట్‌లు మాత్రమే వచ్చాయని, ప్రశ్నపత్రాలను ప్రత్యేక పెట్టెలో ఉంచి పోలీసు, విద్యాశాఖ అధికారుల సమక్షంలో సీల్ చేసి భద్రపరిచినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పక్షోత్సవాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సెక్టార్–1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలు గర్భిణులు, తల్లులకు వివరించారు. పౌష్టికాహారం తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా పుడతారని, పిల్లలు పుట్టిన తర్వాత ఎటువంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. కొంగళవీడు సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.200

పొదిలి: స్థానిక వేలం కేంద్రానికి రైతులు మంగళవారం 506 బేళ్లను తీసుకురాగా 460 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200 కాగా, కనిష్ట ధర రూ.170 పలికిందని వేలం నిర్వహణాధికారి గిరిజాకుమర్ తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీన పొగాకు ముక్క, చూర కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. 150 కేజీలకు మించకుండా సాధారణ బేళ్ల మాదిరిగానే వేలానికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ముందుగా వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా కృష్ణారావు


పీవీ కృష్ణారావు

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా పీవీ కృష్ణారావును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణారావు రెండు దశాబ్దాలుగా బీజేపీలో ఉన్నారు. గతంలో కూడా ఈయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి


ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మార్కాపురం టౌన్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్లా డానియేల్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. 2014 ఎన్నికల్లో అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు తాము అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, సురేష్, జాన్, కిలారీ ప్రసాద్, దానం, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గేదెల్లో గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దర్శి: గేదెల్లో వచ్చే గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కేవీకే పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.లీలాకృష్ణ సూచించారు. మండలంలోని చలివేంద్రంలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. లీలాకృష్ణ మాట్లాడుతూ శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న గేదెల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. పశువులకు వేయించిన టీకాల గురించి వివరించారు. అనంతరం పశువులకు కావాల్సిన మందులు యజమానులకు ఉచితంగా అందజేశారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎం.ఉష, ఎం.జాహ్నవి, పశుసంవర్ధక శాఖ ఏడీఏహెచ్ డాక్టర్ పురుషోత్తం రాజు, డాక్టర్ ఎం. బసవయ్య, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు విజయలక్ష్మి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల సంతోషమే జగనన్న ధ్యేయం

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ
- ఎస్సీ లబ్ధిదారులకు పొట్టేళ్ల యూనిట్ల పంపిణీ


డ్వాక్రా సభ్యులతో కలిసి నమూనా చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: అక్కచెల్లెమ్మల సంతోషమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తర్లుపాడులోని సీడీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 590 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సభ్యులకు విడుదలైన రూ.3,98,66,142 నమూనా చెక్కును లబ్ధిదారులతో కలిసి ఆవిష్కరించారు. వైఎస్సార్ ఆసరా పథకం అమలుతో అక్కచెల్లెమ్మల ఇళ్లలో పండగ వాతావరణం నెలకొందన్నారు. పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని పాదయాత్ర సందర్భంగా జగనన్న ఇచ్చిన హామీని అమలు చేస్తున్నారన్నారు. ఈ నిధులను సక్రమంగా ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు, డ్వాక్రా మహిళలతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ×జై జగన్, థ్యాంక్యూ సీఎం సార్ ×నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. కేక్ కటింగ్ అనంతరం ఎమ్మెల్యే కేపీని మహిళలు ఘనంగా సన్మానించారు.

పొట్టేళ్ల యూనిట్ల పంపిణీ

ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా లబ్దిదారులకు మంజూరైన 10 పొట్టేళ్ల యూనిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే ఇన్సూరెన్స్ పత్రాలు, దాణా, మెడికల్ కిట్లను అందించారు. కార్యక్రమంలో ఏపీఎం పిచ్చయ్య, వైస్ ఎంపీపీ సుజాత, పుణ్యవతమ్మ, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పెద్దమస్తాన్, పార్టీ మండల అధ్యక్షులు మురారి, జేఎస్‌డబ్ల్యూ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వెలుగు సీసీలు సాయి, నాగభూషణం, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి సహకారం


దివ్యాంగులను సన్మానిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: దివ్యాంగుల సంక్షేమానికి సహకారం అందిస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కమిటీ, నియోజకవర్గ కమిటీ, ప్రతినిధులు మంగళవారం జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జంకె వెంకటరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలిమ్‌కో సంస్థ వారు నిర్వహించిన క్యాంప్‌కు సంబంధించి ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, చంకకర్రలు, చేతి కర్రలు వచ్చి నాలుగు నెలలైందని అధికారులతో మాట్లాడి వాటిని పంపిణీ చేయించే ఏర్పాటు చేయలని కోరారు. ఏప్రిల్ 5న కృత్రిమ అవయవాల క్యాంప్‌కు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జంకె వెంకటరెడ్డి దివ్యాంగులను సన్మానించారు.

భూగర్భ జలాలు దుర్వినియోగం చేయవద్దు


మాట్లాడుతున్న భూగర్భ జల శాఖ డీడీ విద్యాసాగర్

మార్కాపురం: భూగర్భ జలాలను దుర్వినియోగం చేయవద్దని భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రైతులు, విద్యార్థులకు భూగర్భ జలాల వినియోగంపై అవగాహన కల్పించారు. విచ్చలవిడిగా డీప్ బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయన్నారు. ఈ నేపథ్యంలోనే వాల్టా చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తునట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వ్యవసాయశాఖ ఏడీ రమాదేవి, హార్టికల్చర్ ఏఓ రమేష్, మైక్రో ఇరిగేషన్ ఏపీఓ ఓబన్న, పెద్దారవీడు ఏఓ బుజ్జిబాయి, జియాలజిస్ట్ జీవన్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటి గంగలో ప్రభ ఏర్పాటుకు సన్నాహాలు


ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

తాళ్లూరు: కొత్తపాలెం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గుంటి గంగా భవాని తిరునాళ్లలో ప్రభ ఏర్పాటుకు జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చర్యలు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం గుంటి గంగా భవాని ప్రాంతంలో స్థలాన్ని ఎంపిక చేశారు. ముందుగా గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ర్యాలీగా బయల్దేరి గుంటి గంగా భవాని అమ్మవారి క్షేత్రానికి చేరుకుని పూజలు చేశారు.

వేగంగా స్టేడియం నిర్మాణ పనులు


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం సుమారు రూ.24 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న స్టేడియం పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం ఆయన స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జెడ్పీ ఫండ్స్ రూ.18 లక్షలు, ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి రూ.6 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఫ్లోరింగ్ కోసం మరో రూ.6 లక్షలు అవసరమౌతాయని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, పార్టీ కౌన్సిలర్లు హర్షిత బాబి, పంచాయతీ రాజ్ ఏఈ మోహన్‌రాజ, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నాగిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే కేపీ పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: ఇటీవల మృతి చెందిన మీర్జాపేటకు చెందిన నాగిరెడ్డి కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదర్శ రైతుగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, పార్టీ అధ్యక్షుడు మురారి, సొసైటీ అధ్యక్షుడు కె.సత్యనారాయణరెడ్డి, స్థానిక ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు రమణారెడ్డి, రామిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వెలుగొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేషయ్య, శ్రీకాంత్ తదితరులున్నారు.

రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురంలో రామాలయం నిర్మాణానికి దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ రూ.1.50 లక్షల నగదు విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు చింతల అంజిరెడ్డి, వేముల శ్రీనివాసరావులు దర్శిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి రామాలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తన వంతు విరాళంగా రూ.లక్షన్నర నగదును వారికి అందజేశారు. గ్రామస్తులు ఐక్యంగా చేపడుతున్న నిర్మాణంలో తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. గ్రామాభివృద్ధికి రాజకీయలకు అతీతంగా కలిసి పనిచేయడం అభినందనీయమన్నారు.

పోషక విలువలతోనే ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య



పొదిలిలో ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్, కార్యకర్తలు

కొమరోలు: బాలింతలు, గర్భిణులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పోషణ సంబరాలు కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రం కొమరోలులోని వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పోషక విలువలతో కూడిన పదార్థాలు అందిస్తోందని, వీటిని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు వినియోగించాలని తెలిపారు. వీటి ద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని ఎక్కువగా వినియోగించాలన్నారు. జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, ఎంపీటీసీ తిరుమలరాజు, వైద్యాధికారి డాక్టర్ చైతన్యదీపక్, ఈవోఆర్‌డీ రాధాకృష్ణమూర్తి, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఏఓ రాజశ్రీ, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పొదిలిలో పోషణ్ పక్వాడా ర్యాలీ

పొదిలి: స్థానిక లెనిన్ భవన్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పోషన్ పక్వాడా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సూపర్‌వైజర్ సావిత్రి మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చిరుదాన్యాలతో తయారు చేసే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ కె.రాఘవ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఈఈ ప్రసాదరావు


సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ ప్రసాదరావు

ముండ్లమూరు: జగనన్న కాలనీల్లో ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ఈఈ ప్రసాదరావు అన్నారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలు పొందిన వారు వచ్చే నెల 14వ తేదీ నాటికి గృహ ప్రవేశాలకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందన్నారు. గృహ ప్రవేశాల కోసం మండలంలో 208 గృహాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అందులో ప్రస్తుతం 156 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 52 మంది లబ్ధిదారులను కలిసి వారికి అవసరమైన ఏర్పాట్లకు సిబ్బంది సహకరించాలన్నారు. పూర్తి స్థాయి బిల్లులు చెల్లించాలన్నారు. వారికి సహకరించడంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలు సాధించడంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఈఈ హెచ్చరించారు. సమావేశంలో డీఈ నిరీక్షణ రావు, ఏఈ హనుమంతరావు, సిబ్బంది చెన్నకేశవులు, నాగేంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ముండ్లమూరు: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మిగులు సీట్ల భర్తీకి అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆవుల సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఒక్కో తరగతిలో 40 సీట్లు, ఏడో తరగతిలో ఒక సీటు, ఎనిమిదో తరగతిలో ఒక సీటు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

వలంటీర్ పోస్టులకు కూడా..

కొమరోలు: మండలంలో ఖాళీగా ఉన్న 9 గ్రామ వలంటీర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో నరసయ్య తెలిపారు. బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో 1, చింతలపల్లిలో 2, దద్దవాడ, ఇడమకల్లు, కొమరోలు–1, కొమరోలు–3, నల్లగుంట్ల, సూరవారిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని, ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలి, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఈ పోస్టుకు అర్హులన్నారు. ఈ నెల 31వ తేదీన దరఖాస్తులను పరిశీలించి 1వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

పంట ఉత్పత్తుల విలువ పెంచాలి


రైతుకు సూచనలిస్తున్న శ్వేత



తాళ్లూరులో మాట్లాడుతున్న ఏపీఎం దేవరాజ్

తాళ్లూరు: మహిళా రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి పంటల ఉత్పత్తికి మార్కెటింగ్ చేసి అదపు వాల్యూ పెంచాలని ఏపీఎం దేవరాజ్ అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులతో వ్యవసాయాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆయన సమావేశమయ్యారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ మహిళా రైతులు ఉత్పత్తిదారుల సంఘ ఖాతాను ఏర్పాటు చేసుకుని దశల వారీగా గ్రూపులను బలోపేతం చేస్తూ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు అమ్మకాలు, కొనుగోళ్లతో విలువ జోడింపు చేసుకోవ్చని చెప్పారు. మండల మహిళా సంఘ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సీసీ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పుచ్చ రైతులకు సూచనలు

కంభం: పుచ్చ తోటలో కాయ తొలుచు పురుగు నివారణకు 100 మిలీ మలాథియన్, 100 గ్రాముల చక్కెర లేదా బెల్లం పది లీటర్ల నీటిలో కలిపి మట్టి చిప్పల్లో వేసి పొలంలో అక్కడక్కడా ఏర్పాటు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి డి.శ్వేత సూచించారు. మండలంలోని చిన్న కంభంలో సాగు చేస్తున్న పుచ్చకాయ పంటను మంగళవారం ఆమె పరిశీలించారు. తోటలో కాయ తొలుచు ఈగ, బూడిద తెగులు ఉన్నట్లు ఆమె గుర్తించారు. బూడిద తెగులు నివారణకు పొలాన్ని శుభ్రంగా ఉంచడం చాలా అవసరమన్నారు. తెగులు సోకిన ఆకులను ఎప్పటికప్పుడు తీసివేసి దూరంగా తగల బెట్టాలని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

పుల్లలచెరువు: నేషనల్ మెరిట్ మీన్స్ కం మెరిట్‌స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు స్థానిక జెడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. పాఠశాలకు చెందిన పిట్టా వెంకటకుమార్, గొట్టిముక్కల షడ్రక్‌లు అర్హత సాధించారని పేర్కొన్నారు. వీరిని గైడ్ చేసిన ఉపాధ్యాయుడు మస్తాన్ వలిని హెచ్‌ఎం అభినందించారు.

యర్రగొండపాలెం: ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. గత నెల 5వ తేదీన కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహించింది. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటారు. వీరిలో కరణం జయసాయి చైతన్య జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు, బొందిలి గాయత్రి సింగ్‌కు 16వ ర్యాంకులు లభించాయి. వీరితో పాటు ఖాశింవలి, ప్రణయ్‌కుమార్, నవ్యశ్రీ, భువన్ సింగ్‌లు స్కాలర్‌షిప్‌లకు అర్హత సాధించారు. ఒక్కో విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.12 వేలు ప్రకారం నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్ అందజేయనుంది. ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తాచాటిన విద్యార్థులను, వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎంవీ భాస్కర్‌ను హెచ్‌ఎం శామ్యూల్‌జాన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

దర్శి: రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన తానంచింతల సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కురిచేడుకు చెందిన పెనుగొండ యోగిరెడ్డి, బుచ్చమ్మలు తానంచింతలలోని ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో పోతవరం రోడ్డు వద్దకు రాగానే మట్టి టిప్పర్ ఢీకొంది. దంపతులు మోటారు సైకిల్ నుంచి కింద పడి గాయపడ్డారు. క్షతగాత్రులను దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.